క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్

ములకలపల్లి: ములకలపల్లి మండలం మీదుగా దొడ్డిదారిన లారీల్లో ఇసుక తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా సాగుతూనే ఉంది. తిమ్మంపేట, పొగళ్లపల్లి గ్రామాల మీదుగా ఓవర్‌లోడుతో వస్తున్న వాహనాల వల్ల తమ రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు, ఈ ఉదంతంపై 'అడ్డదారికి అడ్డుకట్ట పడేనా..?' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈక్రమంలో సోమవారం సాయంత్రం కంపగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుకలారీని పోలీసులు స్వాధీనం చేసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలింపు పత్రాలు సక్రమంగా లేకపోవడంతో లారీని సీజ్ చేసి, తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై సాయికిరణ్‌రెడ్డి తెలిపారు.

సీపీఎం హయాంలోనే అభివృద్ధి

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి సీపీఎం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలతోనే జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పోరాడి నిధులు తెచ్చుకునే చరిత్ర సీపీఎందేనని, ఇలాంటి పార్టీని విమర్శించే అర్హత రోజుకో పార్టీ మార్చే అవకాశవాదులు తాత మధు, తెల్లం వెంకట్రావ్‌లకు లేదని అన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఎంబి.నర్సారెడ్డి, రేణుక, గంగా, వెంకటరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

యువకులకు సన్మానం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట గ్రామానికి చెందిన దూదిపాల భానుప్రసాద్, బత్తుల విష్ణువర్ధన్‌లు ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించి ఆర్మీకి ఎంపికయ్యారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు యువకులను పుష్పగుచ్ఛాలతో అభినందించడమే కాకుండా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. యువత లక్ష్యాలను ఎంచుకుని వాటిని కృషి, పట్టుదలతో సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సమితి సింగారం పంచాయతీ సమితిసింగారం, గుండు సింగారం గ్రామాల్లో నాయకులు విస్తృతంగా పర్యటించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చెపట్టబోయే ఆరు గ్యారెంటీలను వివరించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కేవిరావు, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్ మాట్లాడారు. మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, ఉపసర్పంచులు గోరంట్ల కనకయ్య, వెంకట్రావ్ గౌడ్, బాజి, నాయకులు సుబ్బారెడ్డి, చాంద్ పాషా, చింతల కృష్ణ, మాదాడి రాజేశ్, రాములు, వరలక్ష్మి, పాషా, జగన్ పాల్గొన్నారు.

ఇళ్లు కేటాయించాలి

మణుగూరుటౌన్: మండలంలోని వాగు మల్లారంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి సుధాకర్‌లు క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించారు. వాగు మల్లారంలో లోతు ప్రాంతంలో ఇల్లు కట్టి నిరుపయోగంగా వదిలేశారని, రామానుజవరంలో కూడా అలానే వదిలేశారని అన్నారు. కలెక్టర్ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మంగి వీరయ్య, కన్నబోయిన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజకీయం కోసమే వాడుకుంటున్నారు..

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో వడ్డెర కులస్తులను రాజకీయ నాయకులు ఓట్ల కోసం వాడుకుంటున్నారే తప్ప వారి అభివృద్ధికి కృషి చేయడం లేదని వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తురక లక్ష్మయ్య అన్నారు. పట్టణంలోని జగదీష్ కాలనీలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు రాజకీయ స్వలాభం కోసం తమకు అనుకూలంగా ఉండే వారికే పథకాలను అందజేస్తున్నాయని ఆరోపించారు. వడ్డెరలను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. గుంజ ఏడుకొండలు, బాబు, చిన్న కేశవ, వల్లెపు వెంకన్న, పిట్ల శివ, గుంజ శ్రీరామ్, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

చర్లరూరల్: చర్ల బీఆర్‌యస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ తాతా మధును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఎంపీపీ కోదండ రామయ్య, కొటేరు శ్రీనివాసరెడ్డి, కుమార్ రాజా, ఆలం ఈశ్వర్, బోళ్ల వినోద్, ఆర్.అరుణ్, గూడపాటి సతీశ్‌లు ఉన్నారు.

మహాత్మా గాంధీ జయంతి

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని సోమవారం అన్నిచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టి రోగులకు పండ్లు, బ్రెడ్ అందించారు. పలువురు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, పలు పార్టీల, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విప్ రేగా కాంతారావు


మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు


భద్రాచలంటౌన్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్


భద్రాచలంటౌన్: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య


మణుగూరురూరల్: బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో..


చర్ల: నివాళులర్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది


దుమ్ముగూడెం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వేడుకలు..


మణుగూరుటౌన్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


గుండాల: గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు


దమ్మపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న పొంగులేటి అనుచరులు


అశ్వారావుపేటరూరల్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి


అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో..


చంద్రుగొండ: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల్లో రోడ్ల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నారని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో సుమారు రూ.87లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గం సీఎం కేసీఆర్ హయాంలో అన్ని విధిలా అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యంబాబు, అప్పారావు, యాదగిరిగౌడ్, రాంబాబు, మహిళా నాయకురాళ్లు రమాదేవి, చంద్రకళ, యువజన నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండలంలోని సమితిసింగారం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం పరిశీలించారు. కళాశాల పరిసరాలను పరిశీలించి.. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరోవైపు, మండలానికి చెందిన ఎస్‌కె.నఫీజ్ పాషాకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును కాంతారావు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన వివిధ పార్టీలను వీడి సుమారు 100 కుటుంబాల వారు రేగా కాంతారావు సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రేగా కాంతారావు వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజరకు చెందిన బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సతీష్‌తో పాటుగా మరో 70మంది సోమవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, చేతుల వీర్రాజు, ఖగేందర్‌రెడ్డిలు ఉన్నారు.

గ్రామ సభలు

దమ్మపేట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించారు. మండల పరిధిలోని 31 పంచాయతీల్లో సభలు నిర్వహించగా.. సాదాసీదాగా కొనసాగాయి. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలపై తీసుకున్న ప్రత్యేక చర్యలను వివరించారు. పంచాయతీల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ మోడల్ కాలనీకు మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నార్లపాటి సుమతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జగన్నాథం, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.పాషా, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గోద్వాన రాష్ట్ర అధ్యక్షుడు సోందె వీరయ్యను సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు. సోందె వీరయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నెల రోజుల పాటు చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీరయ్య ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సరేళ్ళ నరేష్, రవికుమార్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

అశ్వాపురం: మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకుడు దండి రాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో 24 గ్రామ పంచాయతీల ప్రజలు మణుగూరు, భద్రాచలం, సారపాక వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఎంతో కాలంగా సమస్య విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఆధార్ కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు.

మా మొర వినండి..

రోజుల తరబడి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, సెకండ్ ఏఎన్‌ఎంలు సోమవారం వినతులకు తెరలేపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. మా మొర వినండంటూ నివేదించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమ్మెలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. కార్మికులతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోయాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురం: మొండికుంటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


గుండాల: గాంధీ వేషధారణలోని చిన్నారికి వినతిపత్రం సమర్పిస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు


చంద్రుగొండ: గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆశావర్కర్లు

ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారా?

చర్ల: ఎన్నికలు రాగానే అధికార పార్టీ నేతలు మిడత దండులా వస్తున్నారని భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. సోమవారం చర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం మండలంలోని రైస్‌పేటలో ఉన్న సీవీకే రావు గృహంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలొచ్చినప్పుడే అధికార పార్టీ నేతలకు ప్రజలు గుర్తొస్తారని, అదే క్రమంలోనే ఇప్పుడు గ్రామాల్లో కనబడుతున్నారని అన్నారు. కరోనా కష్టం కాలంలో గానీ, ప్రకృతి ప్రకోపించి వచ్చిన వరదల సందర్భంలో గాని, ధాన్యం తడిసి రైతు గగ్గోలు పెడుతున్న సమయంలోగాని, ధాన్యాన్ని ప్రభుత్వం కొనకుండా కళ్లాలన్లోనే నిల్వ ఉంచినప్పుడు గానీఅధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు ప్రజలు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం తదితర హామీల విషయంలో అధికార పార్టీ అమలు చేసింది లేదని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఇతర కార్మికులు చేస్తున్న సమ్మెలకు ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఇర్రంకి ఉదయ ప్రభాకర్, బండారు రామకృష్ణ, చీమలమర్రి మురళీకృష్ణ, ఆవుల పుల్లారావు, భాస్కర్‌రావు, చీమకుర్తి వీరభద్రం, ఇందుల బుచ్చిబాబు, సుందరి సురేష్‌కుమార్, జవ్వాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

గురుకులాల్లో మెరుగైన విద్య

అన్నపురెడ్డిపల్లి: రాష్ట్రంలోని గురుకులాల్లో మెరుగైన విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకులంలో రూ.5 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారి పిల్లల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలను స్థాపించిందని, వాటిల్లో సదుపాయాలకు కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ, ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజు, ఎంపీపీ సున్నం లలిత, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట జెడ్పీటీసీలు భారత లాలమ్మ, పైడి వెంకటేశ్వరరావు, గుంపెన పీఏసీఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, డీఈఈ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ బోడా పద్మ, నాయకులు, గురుకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

రోడ్డుకు శంకుస్థాపన..

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో సోమవారం పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గుట్టపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి శంకుస్థాపన చేశారు. ఐటీడీఏ నిధులతో నిర్మించే, ఈ బీటీ రోడ్డు అంచనా వ్యయం విలువ రూ.ఒక కోటి 60 లక్షలు అని ఎమ్మెల్యే తెలిపారు. పూజలు, పరామర్శలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, ఎంపీటీసీ గుడపాటి వెంకట్రావు, సర్పంచ్ వెంకమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన


డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

చర్ల: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు, మీడియా కమిషన్ ఏర్పాటు, రైల్వే పాసులను పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో సోమవారం చర్లలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో చర్లలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు గాంధి సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు దొడ్డా ప్రభుదాసు, కొంగూరు రమణారావు, మోతుకూరి చిన వెంకటేశ్వర్లు, సంతోష్‌వర్మ, మురళి, రామలక్ష్మణ్, కిరణ్, కిషోర్, మణికుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా ర్యాలీ


భద్రాచలంటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు, పంచాయతీ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వావ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ.. పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు, వావ్ సంస్థ కోఆర్డినేటర్ రమ్య, రాజేశ్వరి, రోజా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో శ్రమదానం

దుమ్ముగూడెం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో సోమవారం 141/ఏ బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్పీఎం భాష ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. లక్ష్మీనగరం గ్రామంలోని బస్టాండ్, ఎస్‌బీఐ బ్యాంక్, కిడ్స్ పాఠశాల, ములకపాడు సెంటర్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. 141/ఏ బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై మురుగు నీరు



పట్టణంలోని మణుగూరు సబ్ డివిజన్ కార్యాలయం సమీపంలోనే రహదారిపై మురికినీరు నిల్వ ఉండి అధ్వానంగా దర్శనమిస్తోంది. అప్పుడప్పుడు కురుస్తున్న చిరు వర్షాలకు వర్షపు నీరు రహదారిపై చేరి.. ఎటూ వెళ్లే మార్గం లేకుండా పోతోంది. రోజుల తరబడి ఆ నీరు అక్కడే నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వృద్ధి చెందుతున్నాయి. తద్వారా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా అనారోగ్యాలకు గురవుతున్నారు. నిత్యం అధికారులు సంచరించే ఈ ప్రాంతంలో ఎటువంటి మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు, పలువురు వ్యాపారస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. – మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, మణుగూరు
ఫోన్ నంబర్: 9849909514